హైదరాబాద్ వార్త



## మలక్‌పేట సాహైల్ హోటల్‌లో అగ్ని ప్రమాదం

**ఊపిరాడక వర్కర్ మృతి ● మంటలను అదుపులో తెచ్చిన ఫైర్ సిబ్బంది**





మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది, (ఇన్‌సెట్‌లో) ఊపిరాడక మృతిచెందిన షాబుద్దీన్ మృతదేహం

మలక్‌పేట, డిసెంబర్ 6 ప్రభాతవార్త : మలక్‌పేట సాహైల్ హోటల్ వంట గదిలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో దట్టమైన పొగతో ఊపిరాడక వర్కర్ షాబుద్దీన్ (34) మృతి చెందాడు. ఈ ప్రమాదంలో ఒక్కసారిగా మంటలు చెలరేగటంతో పరిసర ప్రాంతాల్లో దట్టమైన పొగ అలుముకుంది. దీంతో పొగతో పక్కనే ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళలు, వారి సహాయకులు ఊపిరాడక బయటకు పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తీసుకువచ్చారు. 4 యంత్రాలతో మంటలు ఆర్పివేశారు. ప్రమాదానికి గల కారణాలను విశ్లేషిస్తున్నామని అధికారులు తెలిపారు. కిచెన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా లేదా గ్యాస్ లీక్ అవ్వడంవల్ల ప్రమాదం సంభవించిందా అనే దానిపై విచారణ చేస్తున్నామని డిస్ట్రిక్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నాలుగు ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అడిషనల్ డీసీపీ శ్రీనివాస్‌రెడ్డి, సుల్తాన్ బజార్ ఏసీబీ దేవేందర్, చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్‌రెడ్డి పరిస్థితిని సమీక్షించారు. ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఘటన స్థలాన్ని మలక్‌పేట ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్ సందర్శించారు. ఈ మేరకు చాదర్‌ఘాట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## గౌడకులస్తులందరూ ఐక్యంగా అభివృద్ధి చెందాలి

మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, జనవరి 6 ప్రభాతవార్త: గౌడ ఐక్యసాధన సమితి రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను శుక్రవారం రాష్ట్ర ఆబ్కారిశాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గౌడకులస్తులందరూ ఐక్యంగా ఉండి అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు బబ్బురి భిక్షపతిగౌడ్, ఉపాధ్యక్షుడు గనగాని శంకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పొన్నం నారాయణగౌడ్, మహిళా విభాగం గౌరవ అధ్యక్షురాలు బింగి ఇందిరాగౌడ్, రాష్ట్ర అధికార ప్రతినిధి పంజాల నర్సింహగౌడ్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు నేమురి సాయిరాంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కాలేజీ బస్సు ఢీకొని ద్విచక్రవాహనదారుడి మృతి



మృతిచెందిన శ్రీహర్ష (ఫైల్‌ఫోటో)

గచ్చిబౌలి, జనవరి 6 ప్రభాతవార్త : మితిమీరిన వేగంతో దూసుకువచ్చిన కాలేజీ బస్సు ఢీకొట్టడంతో ఓ ద్విచక్రవాహనదారుడు మృతిచెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం పరిధిలోని పాయకరావుపేటకు చెందిన అనుసూరి శ్రీహర్ష(37) నగరానికి వచ్చి కుటుంబంతో సంగారెడ్డి జిల్లా భీరంగూడ పరిధిలోని ఇక్రిశాట్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. శ్రీహర్ష ఇండియన్ ఇమ్యూనోలాజికల్స్‌లో ఉద్యోగం చేస్తుండగా, శుక్రవారం ఉదయం గచ్చిబౌలిలోని కార్యాలయానికి తన ద్విచక్ర వాహనం (ఎపి28డిజి 2997) బజాజ్ పల్సర్ మీద బయలుదేరాడు. మార్గమధ్యలో ఉదయం 8 గంటల ప్రాంతంలో హెచ్‌సియు బస్సు డిపో ముందు ఉన్న సిగ్నల్ దాటిన వెంటనే అతివేగంగా దూసుకువచ్చిన జెబిఐటి కాలేజీ బస్సు (ఎపి29 టిఎ0192) శ్రీహర్ష ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై అపస్మారకస్థితికి చేరుకున్న శ్రీహర్షను స్థానికులు గుర్తించి, అతని ఐడి కార్డు ఆధారంగా శ్రీహర్షతో పనిచేస్తున్న ఉద్యోగులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు సంఘటనా స్థలికి చేరుకొని శ్రీహర్షను స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తరలించగా, అప్పటికే శ్రీహర్ష మృతిచెందినట్లు డాక్టర్లు ధృవీకరించారు. ఈ మేరకు మృతుడు శ్రీహర్ష సోదరుడు క్రిష్ణ చైతన్య పిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## నార్సింగి పోలీసు స్టేసన్ వద్ద సర్దార్జీల హాంగామా

**ఇన్‌స్పెక్టర్‌పై దాడికి యత్నం**



నార్సింగి పోలీసు స్టేషన్ వద్ద ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తదితరులతో గొడవ పడుతున్న సర్దార్జీల దృశ్యం

నార్సింగి, జనవరి 6 ప్రభాతవార్త : నార్సింగి పోలీసు స్టేషన్ వద్ద హత్య కేసు, ఎస్‌ఓటి పోలీసులపై దాడి కేసులకు సంబందించి విచారణ నిమిత్తం తీసుకువచ్చిన సర్దార్జీలు హంగామా చేశారు. ఎవరు నేరం చేస్తే వారిని పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించాలని, ఇలా బస్తీ వాసులను ఎందుకు తీసుకువచ్చి విచారణ పేరుతో ఇబ్బంది పెడుతున్నారని సర్దార్జీలు గలాటా చేశారు. నార్సింగి ఇన్‌స్పెక్టర్ శివకుమార్‌తో ఈ విషయమై వాగ్వాదానికి దిగారు. అడ్డు వద్ద ట్రాఫిక్ పోలీసును చేయితో తోసేశారు. సుమారు అరగంట పాటు పోలీసు స్టేషన్ వద్ద వీరి అరుపులు కొనసాగాయి. వివరాలలోకి వెళితే... నార్సింగిలోని మంచిరేవుల ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో బుధవారం అర్ధరాత్రి తులసీ అనే వ్యక్తిపై దాడి చేసి రూ.15.వేలు ఎత్తుకెళ్లారు. అలాగే ఓ హిజ్రా నిహారికపై అత్యాచార యత్నం చేయగా పెట్రోలింగ్ పోలీసుల అలజడితో పారిపోయారు. అదే రాత్రి నిహారిక భర్త కిషోర్‌ను కత్తితో పొడి దారుణంగా హత్య చేశారు. ఈ రెండు సంఘటనలలో నిందితులను పట్టుకునేందుకు వెళ్లిన ఎస్‌ఓటి పోలీసులపై కూడా దాడికి దిగారు. దీంతో పోలీసులు ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకొని విచారణ నిమిత్తం నిందితుడు కరణ్‌సింగ్‌ను స్టేషన్‌కు తీసుకువచ్చి విచారణ చేస్తున్నారు. కరణ్‌సింగ్ బంధువులు స్టేషన్ వద్దకు వచ్చి హింగామా చేశారు. ఈ మేరకు కేసులు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని నార్సింగి ఇన్‌స్పెక్టర్ శివకుమార్ వివరించారు. చట్టం ముందు అందరూ సమానమేనని, నేరం చేసి తప్పించుకోవాలనుకోవడం, విచారించే పోలీసులపైనే దాడికి యత్నించడం పట్ల విద్యావంతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసు స్టేషన్‌లోనే పోలీసులపైనే ఇంత దురుసుగా ప్రవర్తిస్తున్న వాళ్లు బయట సాధారణ ప్రజల వద్ద ఎలా వ్యవహరిస్తారో అర్థం చేసుకోవచ్చని పోలీసులు పేర్కొంటున్నారు.

## భర్తతో గొడవపడి.. ముగ్గురు పిల్లలతో తల్లి అదృశ్యం



తార్నాక, జనవరి 6 ప్రభాతవార్త: భార్య, భర్తల మధ్య జరిగిన కొడవకారణంగా తన ముగ్గురు పిల్లలతో కలిసి ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైన సంఘటన లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై.రవీందర్ కథనం ప్రకారం. లాలాపేట్ యాదవ బస్తీలో నివాసముండే స్వామి భార్య నాగమణి(36) లాలాపేట్‌లోని హెచ్‌పి పెట్రోల్ బంక్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్నారు. ఇదిలా ఉండగా భార్య, భర్త ల మధ్య చిన్నపాటి గొడవ జరిగింది దీంతో తీవ్రంగా కలత చెందిన నాగమణి ఇంటి నుంచి తన ముగ్గురు పిల్లలైన శ్రీనిధి(13), శ్రీనిజ(13), వెన్నెల(11)తో కలిసి బయటకు వెళ్లింది. వారి కుటుంబ సభ్యులు, స్థానికంగా వెతికినా వారి పిల్లల ఆచూకి దొరకలేదు. దీంతో ఆమె సోదరుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసునమోదు చేసుకొని వారి కోసం గాలిస్తున్నారు.

# చిన్నారుల్లో ఇన్‌ఫెక్షన్లు

ఈవ్యాధి బారిన పడేవారిలో పెద్దల్లో మద్యపానం, ధూమపానం, సమాయనికి ఆహారం తీసుకపోవడం వల్ల ఈవ్యాధి వస్తుండగా,చిన్నారుల్లో వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉండటం వల్ల,టీకాలు సరిగా వేయించకపోవడం వల్ల సమంక్రమించే అవకాశం ఉందని డాక్టర్లు చెబుతున్నారు. ప్రధానంగా గాలీనీరు ద్వారా ఇది సక్రమిస్తుంది. చిన్నారుల్లో పీల్చే గాలి,తాగే నీరు ద్వారా వ్యాధిరక బ్యాక్టీరీయా లైదా వైరస్ గొంతు నుంచి ఊపిరితిత్తులకు చేరతుంది. అప్పుడు ఊపిరితిత్తుల రుగ్మతకు గురై న్యూమోనియాగా మారుతుంది. సకాలంలో గుర్తించి చికిత్స చేయించకపోతే ఊపిరితిత్తుల నుంచి రోగపీడిత రక్తం గుండెకు సరఫరా అవుతుంది. గుండె ఇతర అవయవాలకు రక్తాన్ని పంపు చేయడంతో శరీరమంతా ఇన్‌ఫెక్షన్ అవుతుంది.

**న్యూమోనియాలక్షణాలతో ఆస్పత్రుల బాట**

**దగ్గు, జలుబు, జ్వరాలతో తీవ్ర ఇబ్బందులు**

**వృద్దుల్లోనూ పెరుగుతున్న గొంతు, ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్లు**

**చలికాలంలో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యుల సూచన**



హైదరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త: చలితీవ్రత పెరగడంతో న్యూమోనియాతో వణికిపోతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ప్రైవేట్ ఆస్పత్రులను పరిశీలిస్తే ప్రతి పదిమందిలో కనీసం రెండు న్యూమోనియా కేసులే ఉంటున్నాయి. అప్పుడే పుట్టిన బిడ్డనుంచి ఐదేళ్ల లోపు ఈవ్యాధి బారిన అధికంగా పడుతున్నారు. పలువురు మృత్యువు బారినపడుతున్నారు. ప్రభుత్వ పరంగా వైద్యసేవలు అతంతమాత్రమే కావడంతో పేదలు బాధితులవుతున్నారు. దగ్గు, గొంతు నొప్పి, చెవి ఇన్‌ఫెక్షన్లన్లు, నూప్యమోనియా, బ్రాంకైటీస్, ఆస్తమాతో పాటు శ్వాస తీసుకోవడానాకి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ చిన్నపిల్లల ఆస్పత్రి నిలోఫర్‌లో కూడా గత వారం నుంచి వివిధ రకాల సమస్యలతో చికిత్స కోసం పిల్లను తల్లిదండ్రులు తీసుకు వస్తున్నారు. సాధారణ రోజుల్లో 600వరకు ఓపి ఉంటే అది వెయ్యికి దాటింది. అందులో 50-100కేసుల న్యూమోనియా లక్షణాలతో ఉంటున్నట్లు తెలుస్తుంది. కేవలం నిలోఫర్‌మాత్రమే కాకుండా గాంధీ, ఉస్మానియా, ఫీవర్ ఆసుపత్రికి సైతం రోగుల సంఖ్య పెరిగింది.

**నాలుగు రకాలుగా సోకే అవకాశం..** వ్యాధి తీవ్రతను బట్టి నాలుగు రకాలుగా విభజించారు. బ్యాక్టీరియల్ నియోనియా,వైరల్ న్యూమోనియా శ్వాశకోస సంబంధిత న్యూమోనియా, ఫంగల్ న్యూమోనియా, బ్యాక్టీరియా వ్యాధి సాధారణంగా వచ్చేంది. దీనివల్ల శ్వాస తీసుకోవడంలో సమస్యలు వస్తాయి. ఇన్‌ప్లూయిజా ఏ,బి వ్యాక్సిన్లతో నివారించవచ్చు. శ్వాసకోస న్యూమోనియా శుభ్రంలేని ఆహారం, ద్రవాల ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఫంగల్ నియోనియా విషజ్వరం వచ్చినప్పుడు ఫంగస్‌ల కారణంగా వస్తుంది. ఆహారం తీసుకోవడంలో ఇబ్బంది పడటం, వాంతులు అలవుతుంటే మాత్రం వైద్యుల పర్యవేక్షణలో చికిత్స చేయించడం అవసరం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో న్యూమోనియాకు సంబంధించి ఇచ్చే పీవీసీ వ్యాక్సిన్లు అందుబాటులో లేవు. వీటిని కొనుగోలు చేయాలంటే కనీసం 2వేల నుంచి 4వేల వరకు ఉంటుంది. కొన్ని రాష్ట్రాల్లో వీటిని ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుండగా, మన దగ్గర మాత్రం ఇంకా అందుబాటులో రాలేదు. దీంతో బాధితులు ప్రైవేట్ ఆస్పత్రులను అశ్రయించాల్సి వస్తుంది. ప్రైవేట్ ఆస్పత్రుల్లో సగటున రూ.5వేల నుంచి 7వేల వరకు ఖర్చవుతుంది. చలితీవ్రత పెరగడం, కేసుల తీవ్రత నేపథ్యంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో న్యూయోనియాకు సంబంధించిన చికిత్సలపై దృష్టి సారించి ప్రాణాపాయం నుంచి కాపాడాల్సిన ఆవశ్యకత ఉంది.

**ఈ జాగ్రత్తలు అవసరం..** ఈకాలంలో పొగమంచు ఎక్కువ.ఫలితంగా గాలిలో కాలుష్యంపైకి పోదు. వాకింగ్‌కు వెళ్ళేవారు దీనిబారిన పడి వివిధ శ్వాసకోశ వ్యాధులకు గురవుతారు. బాగా ఎండవచ్చాక నగకకు వెళ్ళాలి. ఉన్నిదుస్తులు, చేతులకు తొడుగుల,ముక్కు,చెవులు మూసేలా ముసుగుల్లాంటివి ధరించడం వల్ల చల్లధనం నుంచి కాపాడుకోవచ్చు. సాయంత్రం సమయాల్లో వ్యాయామం చేయడం మంచింది. పిల్లలను బడులకు పంపే ముందు ఉన్నిదుస్తులు, షూ, చేతులకు తొడుగులు,కాళ్ల చేతులకు కప్పిఉంచేలా జాగ్రత్తలు తీసుకోవాలి. కాచి చల్లార్చిన నీటినే -నెలలు నిండక ముందే పుట్టిన పిల్లలు,ఎన్ఐసీయూ ఉన్న శిశువులు,అప్పుడే పుట్టిన శిశువుల పరంగా జాగ్రత్తలు తీసుకోవాలి. చేతులు శుభ్రం చేసుకోకుండా వారిని తాకకూడదు.

# పొగ మంచు.. ప్రమాదపు అంచు!

**నగరాన్ని కమ్మేసిన మంచు తెరలు ❒ చలికి వణికిపోతున్న సిటీజనులు**



హైదరాబాద్, జనవరి 6 ప్రభాతవార్త : నగరంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఒకవైపు చలి, మరో వైపు చిరుజల్లులతో నగరవాసులు వణికిపోయారు. రెండు రోజులుగా నగరంలో పొగమంజు కురుస్తున్నది. అయితే శుక్రవారం ఉదయం నుంచే నగరవ్యాప్తంగా మంచుతెరలు దట్టంగా కమ్మేశాయి. దీంతో ఉదయం 8గంటలకు కూడా మసక చీకట్లు కమ్ముకున్నాయి. హైదరాబాద్-విజయవాడ, హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై, ఔటర్ సమీపంలో పొగమంచు ఆవరించింది. దీంతో వాహనాలన్నీ లైట్లు వెలిగించి ప్రయాణించాల్సి వచ్చింది. దీనికి చినుకులు తోడవడంతో ప్రజలు ఇండ్లకే పరిమితమయ్యారు. కాగా, నగరంలోని పలు ప్రాంతాల్లో అర్ధరాత్రి నుంచి చినుకులు కురిశాయి. వనస్థలిపురం, ఎల్బీనగర్, హబ్సిగూడ, బోడుప్పల్, తార్నాక, బేగంపేట, పంజాగుట్ట, అమీర్‌పేట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఆర్టీసి క్రాస్‌రోడ్డు, చిక్కడపల్లి, ముషీరాబాద్, అంబర్‌పేట, చింతల్, బాలానగర్, సుచిత్ర, కుత్బుల్లాపూర్‌తో పాటు పలు ప్రాంతాల్లో చిరుజల్లులు పడ్డాయి. శుక్రవారం నగరంలో కనిష్టంగా 15.8 డిగ్రీలు నమోదైంది. రాత్రి ఉష్ణోగ్రతలు సాధారనం కన్నా మూడు నుంచి నాలుగు డిగ్రీలు తక్కువ నమోదవుతుండటంతో సిటీజనులు చలితో గజగజ వణికిపోతున్నారు.

## విభిన్న భారతీయ శాస్త్రీయ నృత్యాల సంగమం భాగ్యనగర్ నాట్యాంజలి

**తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి బోర్డు ఛైర్మన్ డా. సముద్రాల వేణుగోపాలాచారి**



భాగ్యనగర్ నాట్యాంజలి నృత్యోత్సవంలో దృశ్యాలు

రవీంద్రభారతి, జనవరి 6 ప్రభాతవార్త : విశ్వవ్యాప్త కళల్లో భారతీయ శాస్త్రీయకళలు ఎంతో ప్రాచుర్యం సంతరించుకున్నాయని, ఆయా విభిన్న భారతీయ శాస్త్రీయ నృత్యాల సంగమంగా భాగ్యనగర్ నాట్యాంజలి పేరున ప్రముఖ సాంస్కృతిక సంస్థ కళావిపంచి ఫౌండేషన్, నాట్యాలయ డ్యాన్స్ అకాడమీ, జీవి క్రియేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో వైభవోపేతంగా నిర్వహించిన నృత్యోత్సవం ఆహుతులను ఎంతగానో ఆకట్టుకొని మంత్రముగ్ధులను చేసిందన్న తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి బోర్డు ఛైర్మన్ డా. సముద్రాల వేణుగోపాలాచారి దేశ సమైక్యతకు ప్రతీకలు, మారుపేరు కళలేనని స్పష్టం చేస్తూ కళాకారులను, నిర్వాహక సంస్థలను అభినందించారు. ఈ నృత్యోత్సవంలో పూనే కళాకారులచే కథక్; హైదరాబాద్, చెన్నై, దుబయ్, బెంగళూరు కళాకారులచే కూచిపూడి నాట్యాంశాలు; చెన్నై, పూనే, వెస్ట్‌బెంగాల్, ముంబయ్, నైవేలి కళాకారులచే భరతనాట్యం నాట్యాంశాలతోపాటు వివిధ ప్రాంతాల కళాకారులచే గుడియా, లంబాడీ, చెక్కభజన, కథాకళి, ఒడిస్సీ తదితర నృత్యాలతో వేదికను హోరెత్తించారు. ప్రముఖ రంగస్థల నటుడు వెంకటకృష్ణ కృష్ణుని ఏకపాత్రాభినయం హైలైట్‌గా నిలిచింది. ఈ సందర్భంగా జరిగిన సభాకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. సముద్రాల వేణుగోపాలాచారి విశిష్ట అతిథులు డా. సి.ఎన్.గోపీనాథ్‌రెడ్డి, పసుమర్తి శేషుబాబు, డా. అనురాధ, తరుణ్‌రెడ్డి తదితరులతో కలిసి నృత్యప్రదర్శనల్లో పాల్గొన్న వివిధ కళాకారులను ఘనంగా సత్కరించి శుభాశీస్సులందజేశారు.

## మెట్రో స్టేషన్‌లో రైల్ కింద పడి వ్యక్తి ఆత్మహత్య



మూసాపేట, జనవరి 6, ప్రభాతవార్త : మెట్రో రైల్ కిందపడి ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. సీఐ నర్సింగ్ రావు తెలిపిన వివరాల ప్రకారం 35 నుండి 40 సంవత్సరాల వయసుగల ఓ గుర్తు తెలియని వ్యక్తి భరత్‌నగర్ నుంచి కూకట్‌పల్లి వైపు వెళ్తున్న మెట్రో రైల్ మూసాపేట స్టేషన్‌కు చేరుకుంది. అప్పటికే అక్కడ ఫ్లాట్‌ఫారంపై నిల్చున్న గుర్తు తెలియని వ్యక్తి రైలు రాగానే ఫ్లాట్‌ఫారం నుండి వెళ్ళి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే మెట్రో సిబ్బంది గమనించి ఆత్యహత్యకు పాల్పడిన వ్యక్తిని బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. మెట్రో సిబ్బంది పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలాన్ని చేరుకున్న కూకట్‌పల్లి పోలీసులు సీసీ పుటేజ్‌ని పరిశీలించగా ఆత్మహత్య చేసుకునేందుకు మెట్రో రైల్ స్టేషన్‌కి చేరుకున్నట్లు గుర్తించారు. అయితే అతని వద్ద ఎటువంటి ఆధారం లభించకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా సువర్ణ పుష్పాభిషేకం



అల్వాల్, జనవరి 6 ప్రభా తవార్త: అల్వాల్ కానాజీగూడాలోని మరకత శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో శుక్రవారం స్వామివారికి సువర్ణ పుష్పాభిషేకం జరిగింది. ఆలయ వ్యవస్థాపకులు మోత్కూరు సత్యనారాయణ శాస్త్రి పర్యవేక్షణలో జరిగిన క్రతువుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయం ఆద్వర్యంలో సికింద్రాబాద్ చిలకలగూడ చౌరస్తా బసవ తారకం క్యాన్సర్ ఆసుపత్రి వద్ద నిత్య అన్నప్రసాద వితరణ కొనసాగుతోందని సత్యనారాయణ శాస్త్రి తెలిపారు. అన్న దానం ట్రుసుక్ట ధన వస్తు రూపేణా దాతలు సహాయ సహకారాలు అదించాలని ఆయన కోరారు.

## వినియోగదారులకు సౌకర్యంగా విజయపాల డైరీ ఉత్పత్తులు

**మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**



విజయ ఐస్‌క్రీమ్‌ను రుచి చూస్తున్న మంత్రి తలసాని, ప్రిన్సిపల్ సెక్రటరీ అదర్‌సిన్హాలు

గోషామహల్, జనవరి 6 ప్రభాతవార్త: వినియోగదారులకు అందు బాటులో ఉండే విధంగా విజయపాల డైరీ ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకు వస్తున్నామని తెలంగాణ పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో విజయ పాల డైరీ ఉత్పత్తుల స్టాల్‌ను ప్రిన్సిపల్ సెక్రటరీ అదర్‌సిన్హా, విజయడైరీ చైర్మన్ సోమా భరత్‌కుమార్, ఎగ్జిబిషన్ సొసైటి ఉపాధ్యక్షులు అశ్విన్ మార్గం, పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ రాంచందర్, లచ్చురాం భూక్యా, సిఇఓ మంజువాణిలతో కలిసి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ విజయ పాల డైరీని పరిరక్షించేందుకు ఎంతో తోడ్పాటు అందించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 700 కోట్లపైగా టర్నోవర్‌తో విజయ పాల డైరీతోపాటు ఉత్పత్తులను కొనసాగిస్తున్నట్లు చెప్పారు. 40 రోజుల పాటు కొనసాగే నుమాయిష్‌ను తిలకించేందుకు వచ్చే సందర్శకుల అందుబాటులో ఉండే విధంగా విజయ పాల ఉత్పత్తులను అందుబాటులో ఉంచనున్నట్లు వివరించారు. ఎంతో నాణ్యమైన విజయ పాలడెయిరీ ఉత్పత్తులకు మొదటి నుంచి ప్రజాదరణ ఉందన్నారు. గత ప్రభుత్వాలు విజయ పాల డైరీని నిర్వీర్యయం చేసేందుకు ప్రయత్నించినట్లు ఆరోపించారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్ కుమార్‌గౌడ్, సిహెచ్. ఆనంద్‌కుమార్‌గౌడ్, నందకుమార్, ప్రదీప్‌కుమార్ అగర్వాల్, విజయపాల డైయిరీ జనరల్ మేనేజర్ మల్లికార్జున్‌రావు, అరుణ పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలు సేవించి న్యూసెన్స్ చేస్తున్న ఆకతాయిల అరెస్ట్

**17 మందిపై కేసు నమోదు**



అరెస్ట్ అయిన 17 మంది రౌడీ షీటర్లు

ధర్నాచౌక్, జనవరి 6, ప్రభాతవార్త: ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో మాదకద్రవ్యాలు, మద్యం సేవించి గొడవలకు పాల్పడుతున్న 17 మంది యువకులను ముషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ జహంగీర్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం గురువారం రాత్రి ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వైఎస్సార్ పార్క్, పార్సిగుట్ట క్రాస్ రోడ్డు, సెట్‌విన్‌గ్రౌండ్, భోలక్‌పూర్, గోల్డెన్ క్రౌన్ హోటల్, బందన్ ఫంక్షన్‌హాల్, ఏక్‌మినార్, దేవి చౌక్ తదితర ప్రాంతాలలో సీఐ జహంగీర్ యాదవ్, డీఐ ప్రశాంత్ ఆధ్వర్యంలో ఎస్ఐలు సురేందర్, ప్రసాద్‌రెడ్డి, సోమశేఖర్, స్వప్న తదితర సిబ్బంది మెరుపుదాడులు నిర్వహించారు. బహిరంగ ప్రదేశాలలో మత్తు పదార్థాలు సేవించటం, పబ్లిక్ న్యూసెన్స్ చేయటం, రోడ్డుపై నడుచుకుంటూ వెళ్లే మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించటం, వారిలో వారే కొట్టుకోవటం, ఎవరైనా కాలనీ వాసులు ప్రశ్నిస్తే వారిపై తిరగబడటం, చంపుతామంటూ బెదిరింపులకు పాల్పడటం, దారిన పోయే వారి నుండి సెల్‌ఫోన్‌లు, డబ్బులు గుంజుకోవటం వంటివి చేస్తున్నారని స్థానికుల నుండి ఫిర్యాదులు అందటంతో పక్కా ప్రణాళికతో ఆకతాయిలను పట్టుకున్నామని సీఐ తెలిపారు. 17 మందిని అదుపులోకి తీసకుని విచారించి, వారిపై పెట్టీ కేసు నమోదుచేసి, మేజిస్ట్రేట్ మహేందర్ ముందు ప్రవేశపెట్టామని తెలిపారు. 17 మంది కేసు పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం మేజిస్ట్రేట్ వారికి పది రోజుల జైలు శిక్ష విధించారని తెలిపారు.



నగరంలో జరిగిన హైలైఫ్ ఫ్యాషన్ షోలలో పాల్గొన్న మోడల్

## విలువలతో కూడిన విద్యనందించాలి

కంటోన్మెంట్, జనవరి 6 ప్రభాతవార్త: విద్యార్థులకు విద్యార్థి దశలోనే విలువలతో కూడిన విద్యను అందించి సమాజానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని సెంట్రల్ యూనివర్సిటీ రీసర్చ్ డెవలప్‌మెంట్ స్కిల్ డైరెక్టర్ ప్రొ. సామ్రాట్ ఎల్.సబట్ పేర్కొన్నారు. సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో సదాశివ హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా పాల్గొన్న సబట్ మాట్లాడుతూ దేశభక్తి, సంస్క్రుతిని కూడా బోధించాలని చెప్పారు. మంచి సమాజం కోసం విద్యా సంస్థల నిర్వాహణ చేస్తున్న యాజమాన్యాన్ని కొనియాడారు. సదాశివ హైస్కూల్ గ్రూప్ ఫౌండర్ చైర్మన్ డా. ఎస్.శివరావు మాట్లాడుతూ తమ స్కూల్లో వందకు వందశాతం విద్య బోధించడంలో ముందున్నట్లు చెప్పారు. ప్రతిభకల్గిన విద్యార్థులుగా తీర్చిదిద్దడమే తమ ఉద్దేశ్యం అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్క్రతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. భారతీయ సాంప్రదాయాలు, ఉత్సవాలు గొప్పదనాన్ని వివరిస్తూ చేసిన నాటికలు అందరిని ఆకుట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ బ్రాంచ్ డైరెక్టర్ వెంకటరమణ, అకాడమిక్ శర్మ, ప్రిన్సిపల్స్ హర్షిత, నీరజం, వాణి రాజ్‌కుమార్, నాగేందర్, సుమ, లక్ష్మణ్‌తో పాటు విద్యార్థులు, పేరెంట్స్ పాల్గొన్నారు.

## వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించిన ఎమ్మెల్యే


ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే

అల్వాల్, జనవరి 6 ప్రభాతవార్త: వెంకటాపురం మహాబోధి పాఠశాలలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనను ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు ప్రారంభించడం జరిగింది. వైజ్ఞానికం మరియు సామాజిక అంశాలులో కూడిన ఆవిష్కరణలను విద్యార్థులు ప్రదర్శించారు. శాస్త్ర సాంకేతికం ఇతర అంశాలకు చెందిన విషయాలను విద్యార్థులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. పోటీతత్వంతో కూడిన ప్రపంచీకరణలో విద్యార్థుల ఇష్టాలను తల్లిదండ్రులు గౌరవించి ప్రోత్సహించాలని మైనంపల్లి కోరారు. వైజానిక ప్రదర్శనలు ద్వారా విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసే అవకాశం ఉంటుందన్నారు. పాఠశాలలు విద్యార్థి భవిష్యత్తుకు బాటలు వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ట్రస్టీ వెన్నల ప్రిన్సిపల్ రాము హెచ్‌ఎం భవాని కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్ సిఎల్ యాదగిరి పద్మారావు ఇతరులు పాల్గొన్నారు.

## డివిజన్ ప్రజలకు ఎల్లప్పుడు రుణపడి ఉంటా


స్థానికులతో సమావేశమైన మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి

జీడిమెట్ల, జనవరి 6 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూభాష్‌నగర్ డివిజన్ పరిధి సూరారం కాలనీ 142యార్డ్, జైభీమ్ నగర్ కాలనీ సభ్యులు శుక్రవారం మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డిని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు కాలనీలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని సురేష్‌రెడ్డికి విన్నవించారు. అనంతరం సురేష్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలు, బస్తీలలో పర్యటిస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటున్నానని, వాటన్నిటిని ఒక్కొక్కటిగా పరిష్కరించి డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతి బస్తీ,కాలనీలలో మౌళిక వసతులు కల్పించడమే తన లక్ష్యమన్నారు. తనపై విశ్వాసం ఉంచి ఎన్నికల్లో గెలిపించినందుకు డివిజన్ ప్రజలకు కృతజ్ఞతాభావంతో రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో సూరారం కాలనీ, జైభీమ్ కాలనీ నాయకులు ఉన్నారు.

## మంత్రిని కలిసిన చర్చ్ సొసైటీ ప్రతినిధులు

చిక్కడపల్లి, జనవరి 6 ప్రభాతవార్త: రాష్ట్ర పశుసంవర్ధక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను గోల్కొండ క్రాస్‌రోడ్స్ హెబ్రోన్‌చర్చ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి రాగి వీరాచారి(పీటరాచారి) కలిసి ట్రస్ట్ సభ్యులు చేస్తున్న దాడులపై ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఉదయం మంత్రిని కలిసి పూర్తి వివరాలతో నివేదిక అందించినట్లు రాగి వీరాచారి చర్చ్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. హెబ్రోన్ చర్చ్‌కు సంబంధించి వాస్తవాలు తెలియక జెరూసలెం మత్తయ్యతో పాటు ముల్కల భాస్కర్ మరికొందరు మంత్రిని కలిసి సొసైటీపై అవాస్తవాలను మంత్రికి వివరించిన విషయాన్ని గుర్తు చేస్తూ మంత్రికి తాము వాస్తవాలతో సమాచారాన్ని అందించామని, వాస్తవాలు తెలుసుకోకుండా ఎవరూ కూడా స్పందించవద్దని సూచించారు. సొసైటీ, ట్రస్ట్‌ల మధ్య విభేధాలకు కారణాలను, ప్రస్తుతం సొసైటీ హెబ్రోన్ కార్యకలాపాలను జరుగుతున్న అంశాలను మంత్రికి వివరించారు.

## డంపింగ్ యార్డ్‌లో చెత్త సేకరణకు అనుమతివ్వాలి

### డిప్యూటీ మేయర్‌కు వినతి


మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి

తార్నాక, జనవరి 6 ప్రభాతవార్త: లోయర్ ట్యాంక్ బండ్ టిబిటి డంపింగ్ యార్డులో చెత్త సేకరణకు అనుమతి ఇవ్వాలని కోరుతూ గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డికి యూనియన్ ప్రసిడెంట్ యాదగిరి, కార్మికులు వినతిపత్రాన్ని అందజేశారు. డంపింగ్ యార్డులో ఉన్న ప్లాస్టిక్ బాటిల్స్, సంచులు, చెత్తపేపర్లు తధితర వస్తువులను సేకరించి పలువురు జీవనోపాధి పొందుతున్నారని వారికి తెలిపారు. చెత్త సేకరణ చేసేవిదంగా రాంకీ సంస్థకు అనుమతి ఇచ్చేవిదంగా చూడాలని వారిని కోరారు. తగిన జాగ్రత్తలను తీసుకుంటూ చెత్త సేకరణ చేస్తామని వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బేగంపేట దేవ్‌డీలో ఉన్న అన్ని సమస్యలు పరిష్కరిస్తా : మంత్రి తలసాని


బేగంపేట లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి తలసాని

బేగంపేట, జనవరి 6, ప్రభాతవార్త : బేగంపేట డివిజన్ పరిధిలోని దేవ్‌డీలో ఉన్న అన్ని సమస్యలు పరిష్కరిస్తానని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడిపరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. శుక్రవారం బేగంపేట డివిజన్ దేవ్‌డీ ప్రాంతంలో అధికారులతో కలిసి పర్యటించిన మంత్రి స్థానికుల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. డ్రైనేజీ ఓవర్‌ఫ్లో సమస్యను పరిష్కరించాలని కోరగా స్పందించిన మంత్రి వెంటనే ఎయిర్‌టెక్ మిషన్‌ను తెప్పించి సీవరేజ్ క్లీనింగ్‌కు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా రోడ్లను నిర్మించాలని కోరగా వెంటనే ప్రతిపాదనలను అందజేయాలని అధికారులను కోరారు. కాలనీ ప్రజల అవసరాల కోసం నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం 40లక్షల రూపాయలను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. అర్హులైన వారందరికీ పెన్షన్‌లు అందించేందుకు దేవ్‌డీలో మూడు రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని తహశీల్దార్ అహల్యను మంత్రి ఆదేశించారు. తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, సమస్యలను తన దృష్టికి తీసుకు వస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. మంత్రి వెంట కార్పోరేటర్ మహేశ్వరి, మాజీ కార్పోరేటర్ ఉప్పల తరుణి నాయి, డి సి ముకుందరెడ్డి, ఈఈ సుదర్శన్, శానిటేషన్ డిఈ శ్రీనివాస్, వాటర్‌వర్క్స్ మేనేజర్ శశాంక్, స్ట్రీట్‌లైట్స్ అధికారి సాగర్ బీ.ఆర్.ఎస్ నాయకులు డి.వి. నరేందర్‌రావు శ్రీనివాస్‌గౌడ్, కాలనీ అధ్యక్షుడు అఫ్జల్ తదితరులు ఉన్నారు.

## పాఠశాలలో విద్యా, వైజ్ఞానిక సదస్సు



విద్యార్థుల నమూనాలను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్

నిజాంపేట్, జనవరి6 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 30వ డివిజన్ రాయల్ మోడల్ స్కూల్లో ఏర్పాటు చేసిన విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనను శుక్రవారం డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు తయారు చేసిన నమూనా పరికరాల పని తీరును డిప్యూటీ మేయర్‌కు వివరించారు. అనంతరం ధన్‌రాజ్‌యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలు సద్వినియోగం చేసుకొని తమ ప్రతిభను వెలికితీయాలన్నారు. ఇదే విధంగా ఉన్నత స్థాయికి చేరుకొని పాఠశాల ప్రతిష్ఠను,తల్లిదండ్రులకు గౌరవాన్ని తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యూనీస్ రాణి, ప్రవీణ్, ఉపాధ్యాయులు రాధిక, స్వాతి, విజయ, షర్మిళ, సుజాత, త్రివేణి, పద్మ, నిరోషా, నాయకుడు కొలన్ జంగారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు శ్రీకృష్ణ యాదవ్ భవన్‌ను సందర్శించనున్న మంత్రి తలసాని

నార్సింగి, జనవరి 6 ప్రభాతవార్త : గండిపేట మండలం కోకాపేట్‌లో నిర్మితమవుతున్న శ్రీకృష్ణ యాదవ్ భవన్ పనులను శనివారం రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పరిశీలించేందుకు వస్తున్నారని చైర్మన్ చింతల రవీంద్రనాథ్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం పదిన్నర గంటల ప్రాంతంలో మంత్రి కోకాపేట్‌కు వస్తున్నారని, మంత్రి పర్యటనలో పెద్ద ఎత్తున యాదవ కుల బాంధవులు పాల్గొని మంత్రి తెలిపే వివరాలు శ్రద్దగా వినాలన్నారు. శ్రీకృష్ణ యాదవ్ భవన్ నిర్మాణంలో ఇంకేమైనా మార్పులు చేర్పులుండాలా? ఏ ఫ్లోర్‌ను ఏఏ కార్యక్రమాలకు వాడుకోవాలి వంటి అంశాలపై యాదవ పెద్దలు సూచనలు, సలహాలు ఇవ్వాలని తెలిపారు.

## అసంఘటితరంగ కార్మికులకు ఆర్థిక భరోసా 'ఈశ్రమ్' కార్యక్రమం

### కార్పొరేటర్ పావనీ వినయ్‌కుమార్

చిక్కడపల్లి, జనవరి 6 ప్రభాతవార్త: అసంఘటితరంగానికి చెందిన కార్మికులకు 'ఈశ్రమ్' ఆరోగ్య భద్రత కల్పిస్తోందని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్ కుమార్ అన్నారు. గాంధీనగర్ డివిజన్‌లోని చిక్కడపల్లి పెండేకంటి న్యాయకళాశాల ఆవరణలో ఈశ్రమ్ పోర్టల్ ద్వారా పేర్లను నమోదు చేసే కార్యక్రమాన్ని స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్‌కుమార్ ప్రారంభించి ప్రసంగించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎంతో దూరదృష్టితో అసంఘటిత కార్మికులకు ఈశ్రమ్ పోర్టల్ ద్వారా పేర్లు నమోదు చేసుకున్న వారందరికి రూ.2లక్షల బీమా సౌకర్యాన్ని కేంద్రం కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ అధికారులు శిరీష, రజనీ, పెండేకంటి న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అరవిందా, నగర బిజెపి నేత ఎ.వినయ్‌కుమార్, డివిజన్ బిజెపి అధ్యక్షుడు రత్నాసాయిచంద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సేవలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ముందుండడం అభినందనీయం : సాయన్న


వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే సాయన్న తదితరులు

కంటోన్మెంట్, జనవరి 6 ప్రభాతవార్త: సామాజిక సేవా కార్యక్రమాల్లో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఎల్లప్పుడు ముందంజలో ఉండడం అభినందనీయమని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే జి.సాయన్న తెలిపారు. శుక్రవారం కంటోన్మెంట్ వాసవి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ కార్యాలయం, నూతన కార్యవర్గ కమిటీ ప్రమాణ స్వీకరోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్, తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పోరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త, ఐడిసి చైర్మన్ అమరావతి లక్ష్మినారాయణ, పోలీస్ హౌజింగ్ కార్పోరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు పాలకూర్తి గాయత్రి మాట్లాడుతూ వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్వర్యంలో ప్రతి ఏటా 50 కోట్ల రూపాయల ఖర్చుతో 9 రాష్ట్రాల్లో వివిధ సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.రవిచంద్రన్, కార్యదర్శి ఇరుకుల్లా రామక్రిష్ణ, కోశాధికారి ఇ.సంతోష్ చక్రవర్తి పాల్గొనడంతో పాటు బాధ్యతలు చేపట్టారు.

## మహిళలకు చీరలు పంపిణి


మహిళలకు చీరలు పంపిణి చేస్తున్న బిజెపి సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు

హైదరాబాద్, జనవరి 6 ప్రభాతవార్త : హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బిజెపి అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు శుక్రవారం వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బర్కత్‌పురలోని బిజెపి కార్యాలయంలో ఆయన పేద మహిళలకు, పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, నల్లకుంట, హిమాయత్‌నగర్, బాగ్‌అంబర్‌పేట, కాచిగూడ కార్పొరేటర్లు అమృత, మహాలక్ష్మీ రామన్‌గౌడ్, బి.పద్మ, కన్నె ఉమారమేష్‌యాదవ్, బిజెపి సీనియర్ నాయకులు కృష్ణగౌడ్, జి.ఆనంద్‌గౌడ్, బ్రహ్మాచారి, కేశబోయిన శ్రీధర్, ప్రసాద్, మధుసూదన్‌యాదవ్, శ్యామ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన : ఎమ్మెల్యే దానం నాగేందర్

ఖైరతాబాద్, జనవరి 6 ప్రభాతవార్త: పలు అభివృద్ధి పనులకు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తన నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలలో సిసి రోడ్డు, సివరేజీలైన్ వంటి వాటికి లాంఛనంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ స్థానిక ప్రజల, స్వచ్ఛంద సేవాసంస్థల అధికారుల సమన్వయంతో తమ పరిధి పరిసర ప్రాంతాలలో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. కొందరు నేరుగా వచ్చి తమ బస్తీల, కాలనీలలోని వివిధ సమస్యలు చెప్పుకుం టున్నా వాటి పరిష్కార మార్గాల కోసం సంబంధిత అధికారులతో మాట్లాడడం వెనువెంటనే జరిగిపోవడం పట్ల వచ్చిన ఫిర్యాదులు చేసిన వారికి సంతోషాన్ని కలిగించినట్ల వుతుందంటున్నారు. ఈ కార్యక్రమంలో బస్తీల, కాలనీల పెద్దలు పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు

## కాలుష్య నివారణకు మొక్కలు నాటాలి : జంపనప్రతాప్

కంటోన్మెంట్, జనవరి 6 ప్రభాతవార్త: పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నివారణకు మొక్కలు నాటాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని శుక్రవారం 1వ వార్డు న్యూ బోయిన్‌పల్లిలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మద్ది భాస్కర్ రెడ్డి, బట్టల కృష్ణ, రాజు, పెరుక మహేందర్, జయరామ్ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## పనులు సకాలంలో పూర్తి చేయాలి: మహాలక్ష్మీరామన్‌గౌడ్


విఠల్‌వాడిలో అధికారులతో మాట్లాడుతున్న మహాలక్ష్మీరామన్‌గౌడ్

హైదరాబాద్, జనవరి 6 ప్రభాతవార్త: హిమాయత్‌నగర్ డివిజన్‌లోని విఠల్‌వాడిలో డ్రైనేజీ, వాటర్‌పైప్‌లైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని డివిజన్ కార్పోరేటర్ మహాలక్ష్మీరామన్‌గౌడ్ అధికారులను డిమాండ్ చేశారు. సగం, సగం పనులు పూర్తి చేసి చేతులు దులుపుకుంటే సరిపోదని ఆమె హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం విఠల్‌వాడిలో కొనసాగుతున్న పైప్‌లైన్‌ల పనులను ఆమె పర్యవేక్షించారు. సగం, సగం పనులు పూర్తి చేసి అధికారులు మమా అంటే సహించేది లేదన్నారు. 5 లక్షల రూపాయల వరకు పనులు పూర్తి చేయవలసి ఉండగా కేవలం 4 రూపాయల వరకు మాత్రమే పనులు పూర్తి చేస్తే సహించేది లేదని, తక్షణమే మొత్తం పనులు పూర్తిచేయాలని, లేని పక్షంలో పనులు ఆపివేయాలని ఆమె డిమాండ్ చేశారు. గత రెండు సంవత్సరాల నుంచి పనులు పూర్తి చేయడం లేదన్నారు. త్వరగా పూర్తి చేస్తే రోడ్డు నిర్మాణం చేపట్టవలసి వస్తుందన్నారు.

## సమాచార హక్కుచట్టం పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎలిగెండ్ల వెంకటేష్


వెంకటేష్‌కు నియామకపత్రం ఇస్తున్న శ్రీనివాస్ తదితరులు

హైదరాబాద్, జనవరి 6,ప్రభాతవార్త: సమాచార హక్కు చట్టం పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా ఎనుగండ్ల వెంకటేష్ ముదిరాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు శుక్రవారం సోమాజి గూడ ప్రెస్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు జంగిడి శ్రీనివాస్ ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈసందర్భంగా జాతీయ అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ అవినీతి లేని శాఖ లేదని అధికారులు సిబ్బంది ప్రజలకు జవాబుదారిగా లేరన్నారు. ప్రజలకు కట్టే పన్నుల ఆదాయం దేనికి ఖర్చు చేస్తున్నారో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 30రోజుల్లో సమాచారం ఇవ్వాలని 2005లో సమాచార హక్కు చట్టం అమలు చేయడం జరిగిందన్నారు. అయితే అవినీతి అరికట్టేందుకు పోరాడుతున్న తమలాంటివారిపై భౌతికదాడులకు పాల్పడటం హేయమైన చర్యగా అభివర్ణించారు. అయినా అవినీతిపై తమ పోరాటం ఆగదన్నారు. నూత నంగా ఎన్నికైన వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతిపై పోరాటానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి నామ సైదులు, కార్యదర్శి జైన శ్రీనివాస్‌లకు సైతం నియామకపత్రం ఐడీకార్డులు అందజేశారు.

## అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెంచాలి : లలితా రఘురామ్



అవయవదానంపై ర్యాలీని ప్రారంభిస్తున్న మోహన్ పౌండేషన్ జాతీయ డైరెక్టర్ లలితారఘురామ్, సుమిత్ రాయ్ తదితరులు

కంటోన్మెంట్, జనవరి 6 ప్రభాతవార్త: ప్రజల్లో అవయవదానంపై అవగాహన పెరుగాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎడల్ వైజ్ టోకియో ఇన్సూరెన్స్ సిఈఓ సుమిత్ రాయ్, మోహన్ పౌండేషన్ జాతీయ డైరెక్టర్ లలితా రఘురామ్‌లు పిలుపునిచ్చారు. అవయదానంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు జిందగి ఎక్స్‌ప్రెస్ పేరుతో నిర్వహించిన ర్యాలీని శుక్రవారం కంటోన్మెంట్ నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్పెన్ లాంటి దేశాల్లో 10 లక్షల మందికి 40 మంది అవయవదానం చేస్తున్నారన్నారు. కానీ మన దేశంలో 10 లక్షల మందికి ఒక్కరు కూడా ముందుకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి అవయవదాన కార్యక్రమానికి ప్రజలు ముందంజలో ఉండాలన్నారు. ఆయా సంస్థల ప్రతినిధులు అభిషేక్ గుప్త, సుజాత, సుబ్రజిత్ పాల్గొన్నారు.

## ప్రాణాలు కాపాడేందుకు రక్తం ఎంతో అవసరం : మంద సురేశ్

అడ్డగుట్ట, జనవరి 6 ప్రభాతవార్త: ప్రాణ రక్షణకు రక్తం ఎంతో అవసరం అని బిజెవైఎం జాతీయ కోశాధికారి ఎం.సాయిప్రసాద్ తెలిపారు. అడ్డగుట్ట బిజెపి కాంటెస్టెడ్ కార్పొరేటర్ మంద అశ్విని సురేశ్, అడ్డగుట్ట శ్యామ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో వంద మంది యువకులు రక్తదానం చేయగా సికెల్ సెల్ సొసైటీ ఫర్ తలసెమియ వారు రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు నరేందర్, మహేశ్ గౌడ్, గెల్లు ఉదయ్ యాదవ్, శివాజీ,నరేశ్, రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ కూరగాయల మార్కెట్ స్థలం బాధితులకు న్యాయం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మట్టా జయంతిగౌడ్

సైఫాబాద్, జనవరి 6 ప్రభాతవార్త: కాప్రా మున్సిపాలిటి పరిధిలోని జవహర్‌నగర్‌లో నిర్మించిన కెసిఆర్ కూరగాయాల మార్కెట్ స్థలానికి ప్రత్యామ్నాయంగా స్థలం ఇప్పించి తమను ఆదుకోవాలని అనేక మంది బాధితులు సిఎంకు, రాష్ట్ర మంత్రి కెటిఆర్‌కు విజ్ఞప్తి చేశారు. తమకు కెటిఆర్, మంత్రి మల్లారెడ్డి తెలుసునని న్యాయం చేస్తామని చెప్పి లక్షలాది రూపాయలు దోచుకున్న బిఆర్ఎస్ నాయకుడిని తక్షణమే అరెస్టు చేయాలని బాధితులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు నర్సింహ, పాపిరెడ్డి, శంకర్, సామాజిక కార్యదర్శి మట్టా జయంతిగౌడ్ మాట్లాడుతూ 2010, 2011, 2012 సంవత్సరాల్లో సుమారు 68 మంది జవహర్‌నగర్‌లో రెండు ఎకరాల స్థలాన్ని ఇళ్ళ స్థలాల కోసం ఖరీదు చేయడం జరిగిందన్నారు. కాగా మూడేళ్ల క్రితం ఆ స్థలంలో కెసిఆర్ పేరిట కూరగాయల మార్కెట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందిని చెప్పారు. ఆనాటి నుంచి బాధితులు నష్టపరిహారం చెల్లించాలని, ప్రత్యామ్నాయంగా మరొకచోట స్థలాలు కేటాయించాలని ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టిం చుకోలేదని, చివరి పలుమార్లు మంత్రి మల్లారెడ్డిని కలిసిన ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమయంలో బిఆర్ఎస్ నాయకుడు సిరా రాజును కలవడం జరిగిందని రాజు తనకు కెటిఆర్, మల్లారెడ్డిలు బాగా పరిచయమని స్థలాలు ఇప్పిస్తానని 25 లక్షలకు ఒప్పందం చేసుకుని 13 లక్షల రూపాయలు తీసుకున్నారని ఆరోపించారు. త్వరలో కెటిఆర్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పిస్తామని వారు తెలిపారు. తమకు సిఎం న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## డివిజన్ అభివృద్ధి పనులపై అధికారులతో సమావేశం


అధికారులతో మాట్లాడుతున్న స్టాండింగ్ కౌన్సిల్ సభ్యురాలు శాంతి సాయిజన్ శేఖర్

నాచారం, జనవరి6 ప్రభాతవార్త: డివి జన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ది పనులపై శుక్రవారం అధికారులతో కార్పోరేటర్ శాంతిసాయిజన్ శేఖర్ వార్డు కార్యాలయంలో సమావేశమయ్యారు. ముఖ్యంగా బ్రిడ్జిల విషయమై పనులు ప్రారంభం కాలేదని తక్షణమే ప్రారంభించాలని, మంజూరైన అంబేద్కర్ యువజన సంఘం భవనం, హనుమాన్ నగర్ సామాజిక భవనం కోసం నిధులు మంజూరైన సంవత్సరం గడుస్తున్నా నేటికి పనులు ప్రారంభించలేదని అధికారులను ప్రశ్నించారు. నూతనంగా కూడ పలు పనులను కూడా ప్రారంభించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ హరిలాల్, డిప్యూటీ ఇంజనీర్ రూపా అసిస్టెంట్ ఇంజనీర్ లింగారావు, వర్క్ఇన్స్ పెక్టర్ విజయ్‌కుమార్, టీఆర్ఎస్ నాయకులు సాయిజన్ శేఖర్ తధితరులు పాల్గొన్నారు.

## మలయాళ స్వామి సేవా సమాజం ట్రస్ట్ వార్షికోత్సవం


కార్యక్రమంలో పాల్గొన్న ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతులు జగద్గురు శ్రీ పరిపూర్ణనందగిరి స్వామి, వెంకటేష్ తదితరులు

చార్మినార్, జనవరి 6 ప్రభాతవార్త : పాతబస్తీ ఉప్పుగూడ వివేకానంద నగర్‌లోని సద్గురు శ్రీ మలయాళ స్వామి సేవా సమాజం ట్రస్ట్ పదకొండువ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతులు జగద్గురు శ్రీ పరిపూర్ణనందగిరి స్వామి, శ్రీ అసంగానందగిరి స్వామి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కె.వెంకటేష్,సేవా సమాజం ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి సరాబు లక్ష్మణ్ గుప్త,ట్రస్టీలు జి.వెంకటేశ్వర్లు,మణిమ్మ,ఎన్.సాంబయ్యతో పాటు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్, జనవరి 6 ప్రభాతవార్త : విద్యుత్ మరమ్మతులు కారణంగా ఈ నెల 7వ తేదీ శనివారం ఉదయం 10 నుంచి 5 గంటలు వరకు మీరాలం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు ఫలక్‌నుమా సిబిడి ఎడిఇ మధుసూధన్ రెడ్డి తెలిపారు.కమేళా ఫీడర్ పరిధిలో 10 నుంచి 12 గంటలు వరకు,ఎజి కాలనీ ఫీడర్ పరిధిలో 10 నుంచి 1 గంట వరకు,రామాటాకీస్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటలు వరకు,హైదర్‌గూడ ఫీడర్ పరిధిలో 2 నుంచి 5 గంటలు వరకు,కాజీపుర ఫీడర్ పరిధిలో 3 నుంచి 5 గంటలు వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నామని చార్మినార్ సిబిడి ఎడిఇ మహ్మద్ అఫ్జల్ తెలియజేశారు.

## బహిరంగ ప్రదేశాలల్లో మూత్ర విసర్జన చేసిన వారిపై జరిమానాలు


మూత్ర విసర్జన చేసిన వారిపై జరిమానాలు విధించిన జిహెచ్ఎంసి అధికారులు డి.డి.నాయక్,డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డిలు

అఫ్జల్‌గంజ్, జనవరి 6 ప్రభాతవార్త: బహిరంగ ప్రదేశాలల్లో మూత్ర విసర్జన చేసిన వారిపై సర్కిల్ 14 గ్రేటర్ హైదరాబాద్ మహానగర పాలక సంస్థ డిప్యూటి మున్సిపల్ కమీషనర్ డి.డి.నాయక్, సర్కిల్ 14 అసిస్టెంట్ మెడికల్ అధికారి డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డిలు జరిమానాలు విధించారు. గోషామహల్ జిహెచ్ఎంసి సర్కిల్ 14 పరిధిలోని ప్రధాన రహదారులపై గోషామహల్, బేగంబజార్ తదితర ప్రాంతాలల్లో బహిరంగ ప్రదేశాలల్లో మూత్ర విసర్జన చేస్తున్న వ్యక్తులపై జరిమానాలు విధించారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం టియూడబ్ల్యూజే పనిచేస్తుంది

తార్నాక, జనవరి 6 ప్రభాతవార్త: జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం డియూడబ్ల్యూజే పనిచేస్తుందని టియూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు యోగానంద్ పేర్కొన్నారు. టియూడబ్ల్యూజే రెండవ రాష్ట్ర మహాసభకు సంభదించి రూపొందించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఓ.యూ ఆర్ట్స్ కాలేజ్ ఎదుట యోగానంద్ స్థానిక జర్నలిస్టులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యోగానంద్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో జర్నలిస్టుల సమస్యలపై, మీడియాపై జరుగుతున్న దాడులపై రాష్ట్ర మహాసభలో చర్చించుకుందామన్నారు. జర్నలిస్టుల హక్కుల సాధన కోసం ఈనెల 8 నుంచి 10వ తేదివరకు పటాన్ చెరువు జీఎంఆర్ గార్డెన్‌లో జరుగనున్న రాష్ట్ర స్థాయి, ఐజేయు పదవ ప్లీనరీ సమావేశాలకు జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నవీన్‌కుమార్, రాష్ట్ర నాయకురాలు కవిత, జిల్లా నాయకులు రాజశేఖర్, ఓ.యూ జర్నలిస్టులు వెంకట్, కంచుకట్ల నందీశ్వర్, ఓ.యూ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు విక్రమ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, వర్కింగ్ ప్రసిడెంట్ కిరణ్, జెమిని రవి, ప్రవీణ్, కిరణ్, జాఫర్, రాజ్‌న్యూన్ రాజు, ఫిరోజ్, జీవన్ పాల్గొన్నారు.

# సబితారెడ్డి సహకారంతో కార్పొరేషన్‌లో ప్రజలకు మౌళిక సదుపాయాలు : మేయర్ దుర్గ దీప్‌లాల్


పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేసిన మేయర్ దుర్గదీప్‌లాల్

**సరూర్‌నగర్, జనవరి 6 ప్రభాతవార్త:** మంత్రి సబితాఇంద్రారెడ్డి సహకారంతో మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలకు మౌళిక సదుపాయాలను కల్పించడానికి కృషి చేస్తున్నామని మేయర్ ముడావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్ అన్నారు. కార్పొరేషన్‌లోని 35వ డివిజన్ ప్రశాంతినగర్ ఫేజ్-2లో రూ.7.50 లక్షల వ్యయంతో అదే విధంగా 36వ డివిజన్ ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీలో రూ.2 లక్షల ఖర్చుతో నూతనంగా చేపట్టిన మంచి నీటి పైప్‌లైన్ ఏర్పాటు పనులకు శుక్రవారం శంకుస్థాపన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ కార్పొరేటర్లు జి.సౌందర్య విజయ్, ఎద్ల మల్లేష్ ముదిరాజ్‌లతో కలిసి పైప్‌లైన్ పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటికి తాగు నీరందించే లక్ష్యంతో పైప్‌లైన్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆశీస్సులతో మీర్‌పేట్ కార్పొరేషన్‌ను అభివృద్ధి పథంలోకి తీసుకుపోతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, వాటర్ వర్క్స్ ఎఇ వివేక్‌లతో పాటు స్థానిక సంక్షేమ సంఘం నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ : మంత్రి హరీష్‌రావు


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న హరీష్‌రావు తదితరులు

**వనస్థలిపురం, డిసెంబర్ 6 ప్రభాతవార్త :** తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ రాష్ట్రఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖమాత్యులు టి.హరీష్‌రావు చేతుల మీదుగా బిఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ సమక్షంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు దుర్గం శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి నూకం బిక్షపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి రఫీయుద్దీన్, కోశాధికారి సుభాష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ శాంతికుమార్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అన్ని జిల్లాల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## గ్రీన్‌హిల్స్‌కాలనీలో గ్రీన్ బెల్ట్ అభివృద్ధికి కృషి : రాగిడి లక్ష్మారెడ్డి


హబ్సిగూడ గ్రీన్‌హిల్స్ కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న కాంగ్రెస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, జనవరి 6 ప్రభాతవార్త :** హబ్సిగూడ గ్రీన్‌హిల్స్ కాలనీలో గ్రీన్ బెల్ట్ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గ్రీన్‌హిల్స్‌కాలనీ వెల్ఫేర్ అసోసియే షన్ సభ్యులతో కలిసి మున్సిపల్ డిఇ చందన, ఎఇ సాయి, టిపిఎస్ మౌనిక ఇతర అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ గ్రీన్‌హిల్స్‌కాలనీలో గ్రీన్ బెల్ట్ అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. గ్రీన్ బెల్ట్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రీన్‌బెల్ట్ అభివృద్ధికి అధికారులకు పూర్తి సహకారమందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీ సంఘం నేతలు, అధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 6 ప్రభాతవార్త:** అభివృద్ధి పనుల విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ పవన్‌కుమార్ పేర్కొన్నారు. కొత్తపేట డివిజన్ ప్రజానివాస్ పేస్ 2లో నిర్మిస్తున్న నూతన డ్రైనేజ్ లైన్, ఎస్ఆర్ఎల్ కాలనీ బాక్స్ డ్రైనేజ్ పనులను గురువారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజ్ నిర్మాణం పనుల సమయంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## కారిడార్ పార్కులో గాంధీ విగ్రహం ఏర్పాటుకు వినతి


ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న ఉప్పల్ నవ దుర్గ యూత్ అసోసియేషన్ నేతలు

**ఉప్పల్, జనవరి 6 ప్రభాతవార్త :** ఉప్పల్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేసే విషయంలో యువత సలహాలు తీసుకోవాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా కొత్త విగ్రహం ఏర్పాటు చేయాలని ఉప్పల్ నవ దుర్గ యూత్ అసోసియేషన్, ఉప్పల్ గణేష్ ఉత్సవ కమిటి, ఉప్పల్ ప్రాంత సనాతన హిందూ ధర్మ సభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి, డిసి అరుణకుమారి తదితరులతో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కమిటి నేతలు మాట్లాడుతూ ఉప్పల్‌లో పూర్వం గ్రామ పెద్దలు నెలకొల్పిన పురాతన విగ్రహాన్ని రోడ్డు వెడల్పులో తొలగించారని, తిరిగి మరో ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు తాముపూర్తిగా సహకరిస్తామని తెలిపారు. ప్రస్తుతం ప్రతిష్టించేందుకు నిర్ణయించిన స్థలంలో ప్రతి ఏటా వినాయక నవరాత్రి ఉత్సవాలు, శ్రీ దేవిశరనవరాత్రి ఉత్సవాలు చేస్తారని తెలిపారు. ఉప్పల్‌లో ప్రతి పండుగలను గ్రామస్థులు కలిసి కట్టుగా చేసుకుంటారని, అయితే గాంధీ విగ్రహం పునః ప్రతిష్టించే చోట పైన పేర్కొన్న కార్యక్రమాలు చేస్తారని తెలిపారు. ఉప్పల్‌నుంచి నారపల్లి వరకు జరుగుతున్న ఎలివేటెడ్ కారిడార్ కింద పార్కు ఏర్పాటు చేసి అక్కడ ప్రయాణికులకు కనిపించే విధంగా గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. కొత్త గాంధీవిగ్రహం ఏర్పాటుకు యువత పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## టిటిడికి రూ.10 లక్షల విరాళం


డిడిని అందజేస్తున్న కొత్త మనోహర్‌రెడ్డి

**సరూర్‌నగర్, జనవరి 6 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గ టిఆర్ఎస్ నాయకుడు కొత్త మనోహర్‌రెడ్డి తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డుకు రూ.10 లక్షల విరాళం అందజేశారు. కుటుంబంతో పాటు సన్నిహితులతో కలిసి శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆయన టిటిడి సూపరింటెండెంట్‌కు విరాళానికి సంబంధించిన రూ.10 లక్షలను డిడి రూపంలో అందజేశారు. కార్యక్రమంలో సప్పిడి జంగారెడ్డి, మల్లెల నరేందర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, కొత్త సరితా రెడ్డి, సునీతరెడ్డి సప్పిడి పావని తదితరులు పాల్గొన్నారు.

## ఆండాళ్ నిలయంలో ఘనంగా పూజలు


ఆండాళ్ నిలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**మలక్‌పేట, డిసెంబర్ 6 ప్రభాతవార్త :** మూసారాంబాగ్‌లోని ఆండాళ్ నిలయంలో ఘనంగా ధనుర్మాస ఉత్సవాలు జరుగుతున్నాయి. ఏత్తకళంగల్ మాతృశ్రీ రిందాదేవి తిరు నక్షత్రం సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా రిందా శరణ్య నాట్యమండలి యశోదా వారి బృందంతో నిర్వహించిన నాట్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా నిర్వాహకురాలు లక్ష్మీదేవి మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన అండాళ్ నిలయంలో దీపోత్సవం, భక్తులతో స్వామి,అమ్మవార్లకు కర్పూర నీరాజనాలు, మంగళ శాసనం, 11వ తేదీన నీరాటోత్సవం, అనంతరం 108 గంగాళాలతో అక్కారవడిశల్ విశేష ప్రసాద నివేదన వితరణ, 14న బోగిపండుగ, ఉదయం 10.30 గంటలకు గోదా కళ్యాణం, సాయంత్రం తిరుప్పావై, ఫలశృతి, అచార్య సంభావన, సన్మానం, ధనుర్మాస వ్రత సమాప్తి తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని భక్తులు హాజరు కావాలని సూచించారు.

## ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన ఉండాలి : ఎసిపి


ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఎసిపి శంకర్‌రాజు

**మలక్‌పేట,జనవరి 6 ప్రభాతవార్త:** విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగిఉండాలని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఎసిపి జి.శంకర్‌రాజు పేర్కొన్నారు. మలక్‌పేటలోని అస్మాన్‌ఘడ్ సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో ట్రాఫిక్ అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలనుపాటించి సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని విద్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, ఇతర వాహనాలకు ఆటంకం కలిగించకుండా నడపాలని సూచించారు. ప్రజల రక్షణే ట్రాఫిక్ పోలీసుల ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. అనంతరం ట్రాఫిక్‌నిబంధనలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జయంత్, ట్రాఫిక్ సిబ్బంది అబ్దుల్ మాజిద్‌ఖాన్, కె. చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ పోలీసులకు సత్కారం


ఉప్పల్ సిఐ గోవిందరెడ్డి, ఇతర అధికారులను సత్కరిస్తున్న బిఆర్ఎస్ నేత గడ్డం రవికుమార్ తదితరులు

**ఉప్పల్, జనవరి 6 ప్రభాతవార్త :** రాష్ట్రంలోనే నెంబర్‌గా నిలిచిన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ సిఐ గోవిందరెడ్డి, ఇతర అధికారులను గురువారం బిఆర్ఎస్ నేత గడ్డం రవికుమార్ పలువురు పార్టీ నేతలతో కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గడ్డం రవికుమార్ మాట్లాడుతూ తెలంగాణలోనే ఉప్పల్ పోలీస్‌స్టేషన్ నెంబర్ 1 ర్యాంక్ సాధించడం ఎంతో గర్వకారణమన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తున్న పోలీసులు కృషి అభినందనీయమన్నారు. రాష్ట్రంలోనే నెంబర్‌గా నిలిచి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఉప్పల్ సిఐ గోవిందరెడ్డితోపాటు, ఎస్ఐలు వెంకట్ రెడి, మైబెల్లి, రమేష్, కోటేశ్వర్‌రావులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నేతలు సూరం శంకర్, చాంద్‌పాషా, డిజె సాయి, దేవేంద్ర చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి : సీఐ రవికుమార్
### ప్రమాదకరంగా మారిన కూలీల అడ్డా


కూలీలకు అవగావన కల్పిస్తున్న ఆదిబట్ల పోలీసులు

**తుర్కయంజాల్, డిసెంబర్ 6 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో కూలీలకు సరైన వసతి లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్డుపైనే నిలుచని రోజు వారి కూలికోసం పాట్లు పడుతున్నారు. ఉదయం 6గంటలకు అంబేద్కర్‌చౌరస్తా వద్దకు చేరుకొని ఎవరైనా పనికి పిలవగానే వారు రోడ్డుపైనే గుంపులు గుంపులుగా ఉండడంవల్ల ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం సాగర్ రోడ్డుపై వాహనాల రద్దీ ఉండటంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని ఆదిబట్ల పోలీస్ స్టేషన్ సిఐ రవికుమార్ ఆదేశాలమేరకు ఏఎస్ఐ యాదయ్య, ఏఎస్ఐ శ్రీనివాస్ అవగాహన సదస్సు ఏర్పాటు చేసి మాట్లాడుతూ చౌరస్తాలో అడ్డా కూలీలు మెయిన్‌రోడ్డు పైకి రాకుండా వారు రోడ్డుకు దూరంగా ఉండాలని సూచించారు. ఏ ఒక్కరికి ప్రమాదం జరిగిన కుటుంబం రోడ్డుపైకి వస్తుందని కాబట్టి అందరూ జాగ్రత్త ఉండాలని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ సుదర్శన్, శ్రీకాంత్, అడ్డా కూలీలు తదితరులు పాల్గొన్నారు

## ఖాజాబాగ్‌లో రోడ్డు పనులు ప్రారంభం : కార్పొరేటర్ శ్వేతమధుకర్‌రెడ్డి


రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్వేత

**సైదాబాద్, జనవరి 6 ప్రభాతవార్త:** ఐఎస్‌సదన్ డివిజన్ ఖాజాబాగ్‌లో రూ.10లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఖాజాబాగ్ కాలనీవాసులకు గతంలో ఇచ్చిన హామీ మేరకు ప్రణాళికాబద్ధంగా పనులు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, కాలనీవాసులు దేవి, సీతారాం నాయక్, బిజెపి నాయకులు రజనీష్, అరుణ్ కుమార్, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్ కార్పొరేషన్ పారిశుధ్య సిబ్బందికి నిత్యావసరాల పంపిణి : మేయర్ పారిజాతనర్సింహ్మారెడ్డి


సిబ్బందికి నిత్యావసరాలను అందజేస్తున్న మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, జనవరి 6 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న పారిశుధ్య సిబ్బందికి శుక్రవారం నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. కార్పొరేషన్ సానిటరీ ఇన్స్‌పెక్టర్ వి.యాదగిరి ఆధ్వర్యంలో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పారిశుధ్య సిబ్బందికి సబ్బులు, నూనెలు, బెల్లం, గ్లౌజులు, ఆప్రాన్స్‌లతో పాటు పని ముట్లను అందజేశారు. అనంతరం బెస్ట్ సానిటరీ ఇన్స్‌పెక్టర్ ఎంపికైన యాదగిరిని అభినందించి కార్పొరేషన్ తరపున ప్రశంసా పత్రాన్ని అందజేశారు. అదే విధంగా చక్కగా విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య జవాన్లు ఎ.రాజు, ఎస్.శ్రీనివాస్, వీరస్వామి, ఇ.నరేష్, సిహెచ్ బాలరాజ్, ఎస్.సంపత్‌రెడ్డి, వి.నర్సింహ, జె.రాజు, రాకేష్‌లకు బెస్ట్ జవాన్ అవార్డు కింద సర్టిఫికెట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, డిఇలు అశోక్‌రెడ్డి, జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి అభివృద్ధి పనులు పరిశీలించిన కార్పొరేటర్


ఉప్పల్‌లో అర్ధరాత్రి అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, జనవరి 6 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను బుధవారం రాత్రి స్థానిక కార్పొరేటర్ మందముల్ల రజితపరమేశ్వర్‌రెడ్డి అకస్మిక తనిఖీ చేశారు. ఉప్పల్ మండే మార్కెట్‌నుంచి కుమ్మరిబస్తీ మీదుగా కచ్చెరి స్కూల్ వరకు రూ.59లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను ఆమె పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పనుల నాణ్యత విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాలనీలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. డివిజన్‌ను ఆదర్శవంతగా తీర్చిదిద్దుతున్నామని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు కార్పొరేటర్ చేపడుతున్న పనులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీ సంఘం నేతలు గుమ్మడెల్లి కృష్ణ, బుర్ర ఈశ్వర్‌గౌడ్, తీగ వెంకట్‌రావు, విఠల్‌రావు, సల్ల ప్రభాకర్‌రెడ్డి, మాశెట్టి రాఘవేందర్, మైనంపల్లి కిషోర్, కన్నమైన నరేష్, రాజు, శేఖర్, సురేష్, రమేష్, అశోక్, తీగ శ్రీను, కిషోర్, మైనంపల్లి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## జైభీం జెండా పండుగలో ఎమ్మెల్యే బేతి


ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పోరేటర్ పన్నాల

**నాచారం, జనవరి 6 ప్రభాతవార్త:** మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఎలిఫెంట్ సర్కిల్ వద్ద నల్లబాలు ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన జైభీం జెండా పండుగ కార్యక్రమంలో ఎమ్మెల్యే భేతిసుభాష్‌రెడ్డి, కార్పోరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, శాంతి సాయిజన్‌శేఖర్, జెర్రిపోతుల ప్రభుదాస్ తధితరులు పాల్గొని జెండారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో నాచారం ఇన్స్‌పెక్టర్ కిరణ్‌కుమార్, కొత్తరామారావు, సాయిజన్ శేఖర్, పళ్ల కిరణ్ కుమార్‌రెడ్డి, యెడల మల్లేష్,కుంటి కృష్ణ, పిఆర్. ప్రవీణ్, పర్ణటి ప్రసాద్, కర్రె శంకర్, పర్ణటి నరేందర్, పొన్నాల మహేందర్, మారుతి, నాయిమ్, పొన్నాల మూర్తి, యాక స్వామి, నరేష్, భూపతి, అశోక్, జబ్బర్, సంతోష్, శ్రీకాంత్, శ్రీనివాస్, అంజి తధితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే మంచిరెడ్డి


లబ్దిదారుకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి

**తుర్కయంజాల్, డిసెంబర్ 6 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ కోహెడకి చెందిన జి. జోష్న అనారోగ్యంతో హైదరాబాదులోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆర్థిక సాయంకోసం కౌన్సిలర్ సిద్ధల జ్యోతి జంగయ్య, రైతు బంధు మండల కోఆర్డినేటర్ కందల బలదేవరెడ్డిని అడగడడంతో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డిని సంప్రదించారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ముఖ్యమంత్రి సహాయనిధినుండి 15 లక్షలు రూపాయల విలువ చేసిన ఎల్ఓసిని మంజూరు చేయించి తన క్యాంప్ కార్యాలయంలో నాయకులతో కలిసి లబ్దిదారు కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు బిందు రంగారెడ్డి, బుడ్డా విజయబాబు, పల్లపు ఆంజనేయులు, గంగని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## టియూడబ్ల్యుజె ద్వితీయ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ : ఎమ్మెల్యే మైనంపల్లి


టియూడబ్ల్యుజె మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మైనంపల్లి

**నేరేడ్‌మెట్ జనవరి 6 ప్రభాతవార్త:** జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు పేర్కొన్నారు. ఈ నెల 8,9,10వ తేదీల్లో జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ పటాన్‌చెరువులో నిర్వహించే రాష్ట్ర ద్వితీయమహాసభల పోస్టర్‌తో పాటు ఇండియన్ జర్నలిస్టు యూనియన్ ఐజెయూ నిర్వహించే పదవ ప్లీనరీ సమావేశాల గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు జార్జి విల్సన్, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు అక్కల రాజేందర్‌గౌడ్, దుశెట్టి పాండు, జర్నలిస్టు నాయకులు ప్రభాకర్, స్థానిక టిఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రేపు కొత్తపేటలో ముగ్గుల పోటీలు

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 6 ప్రభాతవార్త:** కొత్తపేట మారుతి నగర్‌లోని జైన్ మందిర్ వద్ద ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు కొత్తపేట డివిజన్ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు లింగాల రాహుల్‌గౌడ్ తెలిపారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నట్లుగానే ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహిస్తున్నామని తెలిపారు. లింగాల రాహుల్‌గౌడ్, మారుతినగర్ దెవలప్‌మెంట్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు జరుగుతాయన్నారు. ఈ ముగ్గుల పోటీలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేవిరెడ్డి కమల సుధీర్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. ముగ్గుల పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

## ఉప్పల్‌లో విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ఉప్పల్, డిసెంబర్ 6 ప్రభాతవార్త :** ఉప్పల్ సబ్ స్టేషన్ పరిధిలోని వివిధప్రాంతాల్లో శనివారం మరమ్మత్తులు చేపడుతున్న దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎఇ డి. శ్రీనివాస్ తెలిపారు. ఉప్పల్ మున్సిపల్ ఆఫీస్, పోలీస్ స్టేషన్ రింగ్ రోడ్డు భరత్ నగర్, బీరప్ప గడ్డ కుమ్మరి బస్తి, రాఘవేంద్ర కాలనీ, సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, వెంకటేశ్వర కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గమనించాలని కోరారు.

## బిజెపి బూత్ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలి : కొలను శంకర్‌రెడ్డి

**సరూర్‌నగర్, జనవరి 6 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడలో శనివారం జరిగే బూత్ స్థాయి బిజెపి కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర పార్టీ సీనియర్ నాయకుడు, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి కోరారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల వారీగా సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో శనివారం మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడలో సమావేశాన్ని నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. మాజీ ఎంపి పొంగులేటి సుధాకర్‌రెడ్డి సమన్వయంతో జిల్లా పార్టీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి తదితరుల ఆధ్వర్యంలో జరిగే ఈ కీలక సమావేశానికి రాష్ట్ర, జిల్లా, మండల, మున్సిపల్ స్థాయి నాయకులు, బూత్ కమిటీ కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని శంకర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## రూ. కోటి 36లక్షలతో అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే మైనంపల్లి


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి తదితరులు

**మల్కాజిగిరి, డిసెంబర్ 6 ప్రభాతవార్త :** మౌలాలి డివిజన్ పరిధిలో రూ. కోటి36లక్షలతో ఈస్ట్ మారుతి నగర్, శ్రామిక నగర్, సుధానగర్‌లో సీసీ రోడ్డు పనులు, క్రియేటివ్‌నగర్ ఆర్‌సిసి పైప్ లైన్ పనులకు ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కుంటున్న ఇబ్బందులను పరిష్కరించడమే తన లక్ష్యమన్నారు. ప్రజలు తనపై పెట్టకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారి కోసం నిరతంరం పాటు పడతానన్నారు. అంతేకాకుండా నియోజకవర్గ పరిధిలోని డివిజన్లలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, ఈ ఈ లక్ష్మణ్, డిఈ మహేష్, ఎఈ మధురిమా, ఆమినుద్దీన్, గుండా నిరంజన్, భాగ్య నంద్‌రావు, సత్తయ్య, మంద భాస్కర్, ఇబ్రహీం,చందు, సంతోష్ రాందాస్, మబ్బు, గౌలికర్ దినేష్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## మాల బస్తీ అభివృద్ధికి కృషి చేస్తా : కార్పొరేటర్ రజితపరమేశ్వర్‌రెడ్డి


మాల బస్తిలో పర్యటిస్తున్న కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డి

**ఉప్పల్, డిసెంబర్ 6 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని మాల బస్తీ అభివృద్ధికి అన్ని రకాలుగా కృషి చేస్తానని కార్పొరేటర్ మంద ముల్ల రజితపరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కార్పొరేటర్ రజితపరమేశ్వర్‌రెడ్డి మాల బస్తీలో విస్తృతంగా పర్యటించారు. బస్తీలో రూ.17.50 లక్షలతో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. బస్తీవాసులు కార్పొరేటర్ దృష్టికి పలు సమస్యలను తెచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో వెనుకబడిన అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని, బస్తీలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి పనులను చేపడతామని తెలిపారు. త్వరలో మరో రూ.32 లక్షలతో మాల బస్తీలో కమ్యూనిటీ హాల్‌ను నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ నాగేందర్, డిఇ నిఖిల్‌రెడ్డి, ఎఇ వసంత స్థానిక నేతలు మహేశ్వరం రాజు, సల్ల ప్రభాకర్‌రెడ్డి, లగల నవీన్, శీలం నవీన్, ప్రశాంత్‌రెడ్డి, నిరుడు రాంబాబు, జి వెంకటేష్, పాలడుగు లక్ష్మణ్, అస్లాం, మదన్‌గౌడ్, కిషోర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి శిక్షణ : విజయరంగ


శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 6 ప్రభాతవార్త :** యువత స్వయం ఉపాధి కల్పనకోసం అనేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు లైన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బి.విజయరంగా తెలిపారు. లైన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కొత్తపేట, మహిళా ఎన్జీవోస్ తో కలిసి స్వయం ఉపాధి పథకం కింద సుమారు 500 మంది మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు స్నేహ ఫౌండేషన్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వసహకారంతో మహిళలకు, యువతకు ఉచితంగా కుట్టు మిషన్, బ్యూటిషన్, కంప్యూటర్ కోర్సులపై ఉచిత శిక్షణలతో స్వయం ఉపాధి కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రేపు లైఫ్ సెంటర్ చర్చి వార్షికోత్సవం


ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న పాస్టర్ ఇమ్మాన్యూయేల్ తదితరులు

**మలక్‌పేట, డిసెంబర్ 6 ప్రభాతవార్త :** మూసారాంబాగ్‌లోని క్రిస్టియన్ లైఫ్ సెంటర్ చర్చి 24వ వార్షికోత్సవ వేడుకలను 8వ తేదీ ఆదివారం నిర్వహిస్తున్నట్లు చర్చి ఫౌండర్ ప్రభుచరణ్, చర్చిపాస్టర్ ఇమ్మాన్యూయేల్ తెలిపారు. అదే విధంగా చర్చి ఆవరణలో ప్రేమ విందును ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యమానికి మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల విచ్చేస్తారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## పేదలకు నిత్యావసర సరుకులు అందజేత


నిత్యావసర సరుకులు అందజేస్తున్న ప్రేమ్‌కుమార్ తదితరులు

**మల్కాజిగిరి, డిసెంబర్ 6 ప్రభాతవార్త :** గ్రేస్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవ సంస్థ, ఖమ్మం వారు ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌పరిధిలోని సంజయ్‌గాంధీనగర్‌లో కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ చేతుల మీదుగా 60 కుంటుబాలకు బియ్యం, షర్ట్స్, శారీస్, టవల్స్, మిఠాయిలను పంపిణి చేసారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ విజయేంద్రరెడ్డి, లెప్రసి సొసైటీ ప్రెసిడెంట్ రమేష్, సంస్థ ప్రతినిధులు మురళీకృష్ణరెడ్డి, సైదులు మునుస్వామి, అరుణ్‌కిషోర్ తదితరులు పాల్గొన్నారు.